సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
మంగళవారం । 7 । మార్చి । 2023



కేటీఆర్ సభకు తరలించాలి

తొర్రూరులో ఈ నెల 8వ తేదీన జరిగే ఐటీశాఖ మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు మహిళలను తరలించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. - 8లో



గంజాయి విక్రయదారుల అరెస్ట్

వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయదారులు నలుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
36.0° /19.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం వేడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రణాళికాబద్ధంగా చదివితే మెరుగైన ఫలితాలు



విద్యారణ్యపురి: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని హనుమకొండ డీఈఓ అబ్దుల్‌హై అన్నారు. వరంగల్ అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (వడుప్సా) హనుమకొండ జిల్లాశాఖ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధతపై సోమవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టెన్త్‌లో గతంలో 11 ప్రశ్నపత్రాలు ఉండేవని, ఈసారి ఆరు మాత్రమే ఉంటాయని తెలిపారు. ఆయా ప్రశ్నపత్రాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చేతిరాత బాగుండేలా చూసుకోవాలన్నారు. సబ్జెక్టుల నిపుణులు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. సభలో వడుప్సా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్, జనరల్ సెక్రటరీ జ్ఞానేశ్వర్, కోశాధికారి వి.ముక్తేశ్వర్, ముఖ్యసలహాదారులు ఎస్.రమేష్‌రావు, నారాయణరెడ్డి, బాధ్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, ఈశ్వర్, రాజేష్, సంపత్ మాట్లాడారు. 2వేలమంది విద్యార్థులు పాల్గొన్నారు.

కేయూలో విద్యార్థిని కాలు కొరికిన ఎలుకలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో మహిళా హాస్టల్ డీ బ్లాక్‌లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థిని పాదం మడిమెను ఆదివారం రాత్రి ఎలుకలు కొరికాయి. విద్యార్థిని ఆదివారం రాత్రి పడుకున్న సమయంలో కొరికినట్లు హాస్టల్ సిబ్బందికి తెలపగా టీటీ వేయించుకోవాలని సూచించినట్లు సమాచారం. ఎలుక కొరికిన విషయమై ఆ విద్యార్థిని సంబంధిత విభాగం ప్రొఫెసర్ల దృష్టికి సోమవారం తీసుకెళ్లారు. అంతకుముందు రోజు కూడా మరో విభాగం విద్యార్థినిని కూడా ఎలుకలు కొరికినట్లు తెలుస్తోంది. మహిళా హాస్టల్‌లోని డీబ్లాక్‌లో ఎలుకలు ఉన్నాయని విద్యార్థినులు చెబుతున్నా వాటిని నివారణకు అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'కొర్రీల కిరణం'పై కలెక్టర్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్

హన్మకొండ అర్బన్: నగర పరిధిలోని ఓ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, అధికారి వేధింపులపై సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'కొర్రీల కిరణం' కథనం రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపింది. దీనిపై ఆరా తీసిన కలెక్టర్ సిక్తా పట్నాయక్ సదరు కార్యాలయం అధికారిపై సీరియస్ అయ్యారు. సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లాలోని తహసీల్దార్లు, డీఆర్వో, అదనపు కలెక్టర్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొందరు తహసీల్దార్లపై ఎందుకు ఈ స్థాయిలో ఆరోపణలు వస్తున్నాయో ఆరా తీశారు. అందరూ ఒకే నిబంధనలు పాటిస్తే ఇబ్బందులు ఉండవని, ఫైళ్లు పెండింగ్ ఉండడం వల్ల ప్రజలను ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడుతున్న సంకేతాలు వెళ్తాయన్నారు. అదే విధంగా సాక్షి కథనంపై సంబంధిత అధికారినుంచి పూర్తిస్థాయి వివరణ తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఎవరిపైనా ఆరోపణలు వస్తే వదిలే ప్రసక్తే లేదని, సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేసినట్లు తెలిసింది.

ర్యాగింగ్ రహితంగా నిట్



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌ను ర్యాగింగ్ రహితంగా తీర్చిదిద్ది, ఆదర్శంగా నిలుద్దామని కాజీపేట ఏసీపీ పి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ర్యాగింగ్ నివారణ, ర్యాగింగ్‌కు పాల్పడితే తీసుకునే చర్యలపై డైరెక్టర్ ఎన్వీ.రమణారావు, సిబ్బందితో ఏసీపీ శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహనతోపాటు కలిగే దుష్పరిణామాలను తెలియజేయాలని, యాంటీ ర్యాగింగ్ టీంను ఏర్పాటు చేయాలని సూచించారు. పలు హాస్టళ్లలోని విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి యాంటీ ర్యాగింగ్ వాల్‌పోస్టర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాజీపేట ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

ఇంటర్ పర్యావరణ విద్య పరీక్ష

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఇంటర్ విద్యార్థులకు సోమవారం పర్యావరణ విద్య పరీక్ష నిర్వహించారు.116 జూనియర్ కళాశాలల్లో పరీక్షను నిర్వహించినట్లు డీఐఈఓ గోపాల్ తెలిపారు. 18,147మంది విద్యార్థులకుగాను 17,832మంది (98.26శాతం) హాజరయ్యారన్నారు.





వరంగల్ కొత్తవాడలో కామదహనం, రంగులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

హోలీ.. రంగుల కేళి

గ్రేటర్ వరంగల్ వ్యాప్తంగా మంగళవారం హోలీ పండుగను జరుపుకోనున్నారు. సోమవారం నగరంలోని వివిధ కూడళ్లలో వివిధ రంగుల దుకాణాల వద్ద జనం రద్దీ నెలకొంది. పిల్లలకు అవసరమైన వాటర్‌కలర్ గన్నులను కొనుగోలు చేశారు. ఫాల్గుణమాసం కాము నిపున్నమిని పురస్కరించుకుని సోమవారం రాత్రి పలు కూడళ్లలో కామదహనం నిర్వహించారు. వారం రోజులుగా జాజిరి పాటలు పాడుతూ తిరిగిన పిల్ల లు సాయంత్రం తమ కోలలను కామదహనంలో పడవేశారు. మహిళలు దాని చుట్టూ నీళ్లు పోస్తూ గుడాలు చల్లుతూ ఆరగింపుచేశారు.

- హన్మకొండ కల్చరల్

కాశీవిశ్వేశ్వరాలయంలోని సహస్ర లింగానికి అభిషేకం చేస్తున్న అమెరికన్లు



అమెరికన్ల పూజలు

వరంగల్ కాశిబుగ్గలోని చారిత్రక శ్రీ కాశీవిశ్వేశ్వరాలయం, రంగనాథస్వామి ఆలయాలను సోమవారం పలువురు అమెరికన్లు సందర్శించి పూజలు చేశారు. ఇక్కడి ఆలయాలు, సంస్కృతి, సంప్రదాయాలు తమకు ఎంతో నచ్చాయని తెలిపారు. - కాశిబుగ్గ

కనీస వసతులు కల్పించండి

- గ్రేటర్ గ్రీవెన్స్ సెల్‌కు వెల్లువలా వినతులు
- దరఖాస్తులు స్వీకరించిన వింగ్ అధికారులు



కాలనీవాసుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

వరంగల్ అర్బన్: కాలనీల్లో కనీస వసతులు కల్పించాలంటూ గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌లో స్థానికులు మొరపెట్టుకున్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వింగ్ అధికారులు ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించారు. గ్రీవెన్స్‌సెల్‌కు 82 ఫిర్యాదులు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగం - 39, ఇంజనీరింగ్ - 14, పన్నుల సెక్షన్- 14, ప్రజారోగ్యం, శానిటేషన్ - 10, తాగునీటి విభాగం - 5 చొప్పన వినతులు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రవీందర్, డిప్యూటీ కమిషనర్లు అనిసుర్ ఉర్ రషీద్, శ్రీనివాస్ రెడ్డి, జోనా, ఎస్‌ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, బయలాజిస్టు మాధవ రెడ్డి, ఎంహెచ్‌వో జ్ఞానేశ్వర్, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- 29వ డివిజన్‌లో పెద్దమోరీ నిర్మాణం ఏడాదిన్నరగా నత్తనడకన సాగుతుందని, ప్రజల్లో అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మంద శ్యాం వినతిపత్రం అందజేశారు.
- భట్టుపల్లి రోడ్డు వినాయక కాలనీలో సుమారు 20 గుంటల ఖాళీ స్థలం ఉందని, అందులో మట్టి పోసి వాకింగ్ ట్రాక్ వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.
- వరంగల్ ఎల్‌బీనగర్‌లో డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ లాల్బీదొడ్డి ప్రాంతంలో సెట్ బ్యాక్ లేకుండా రోడ్డుపై భవన నిర్మాణం చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు.
- కేయూసీ పెద్దమ్మగడ్డ రోడ్డులో మురికి కాల్వ అసంపూర్తిగా నిర్మించారని, పూర్తి చేయాలని, శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరారు.
- 29వ డివిజన్ రఘునాథ్ నగర్ కాలనీలోని 400 ఇళ్లకు యజమాని పేర్ల మీద ఇంటినంబర్లు ఇవ్వాలని సీపీఎం ఏరియా కమిటీ అధ్యక్షుడు అరూరి రమేష్ విన్నవించారు.
- హనుమకొండ కేయూసీ వంద ఫీట్ల ఏరియాలోని రోడ్డు ఆక్రమించి ఓ వ్యక్తి నిర్మాణానికి పాల్పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.
- హనుమకొండ ప్రగతినగర్ ఫేజ్-2లో డ్రెయినేజీ నిర్మించాలని రెండుమార్లు అభివృద్ధి కమిటీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.
- హంటర్ రోడ్డులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు నాలా స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని, గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు పలువురు వినతిపత్రం అందజేశారు.
- 1వ డివిజన్ నారాయణ నగర్ ఎర్రగుట్ట నుంచి కరీంనగర్ రోడ్డు వరకు డ్రెయినేజీ నిర్మించాలని, ఇప్పటివరకు 5సార్లు వినతులు సమర్పించినట్లు ఫిర్యాదు సమర్పించారు.
- హంటర్ రోడ్డు 23-6-203 ప్రాంతంలో డ్రెయినేజీ నిర్మించాలని ఓ ప్రైవేట్ విద్యాసంస్థ నిర్వాహకులు కోరారు.
- వడ్డేపల్లి మైత్రి నగర్‌లో సీసీ రోడ్డు నిర్మించాలని మోహన్ రెడ్డి విన్నవించారు.
- చెత్తపన్ను చెల్లించినా మళ్లీ ఆస్తిపన్నుతో కలిసి వస్తుందని, మినహాయించాలని శివనగర్‌కు చెందిన శ్రీకాంత్ కోరారు.

వినతులపై జాప్యం వద్దు..

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో ప్రజలనుంచి వచ్చిన వినతులపై జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో ప్రజలనుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో సమస్యలపై స్వీకరించిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్-17, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ - 08, ఆర్‌డీఓ హనుమకొండ - 06తోపాటు పలు శాఖలకు సంబంధించిన మొత్తం 96 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ వాసుచంద్ర, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ కిరణ్ ప్రకాష్, డీపీఓ జగదీశ్వర్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డీఎండబ్ల్యూఓ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవిలత, డీడబ్ల్యూఓ సబితా పాల్గొన్నారు.

త్వరితగతిన పరిష్కరించాలి

వరంగల్ కలెక్టర్ గోపి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ గోపి

వరంగల్ రూరల్: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ బి.గోపి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులను క్షుణ్ణంగా పరిశీలించి.. పరిష్కరించాలన్నారు. అలాగే వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందుల్లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి అందేలా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించి 20, ఆర్డీఓ వరంగల్ 7, జీడబ్ల్యూఎంసీ 5తోపాటు తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 68 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట, ఆర్డీఓ మహేందర్ జీ, డీఈఓ వాసంతి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పోలీస్ భరోసా

- భూ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి
- ప్రజలకు చట్టాలపై అవగాహన అవసరం
- డ్రగ్స్ నియంత్రణ కోసం అవగాహన సదస్సులు
- 'సాక్షి'తో ఈస్ట్‌జోన్ డీసీపీ పుల్లా కరుణాకర్

SAKSHI INTERVIEW



మాట్లాడుతున్న డీసీపీ పుల్లా కరుణాకర్

వరంగల్ క్రైం: 'పోలీసులు.. వివిధ సమస్యలపై స్టేషన్‌కు వచ్చే వారికి భరోసాగా ఉండాలి.' అని ఈస్ట్‌జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) పుల్లా కరుణాకర్ అన్నారు. వరంగల్ కమిషనరేట్‌లో ఇటీవల డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన 'సాక్షి'తో పలు అంశాలపై మాట్లాడారు. తన పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న అంశాలను వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

భూ సమస్యలపై ఎక్కువ ఫిర్యాదులు.. .

ఈస్ట్‌జోన్ పరిధి ఎక్కువ గ్రామీణ ప్రాంతం..కొంత నగర ప్రాంతం ఉంటుంది. ఇక్కడి పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుల్లో చాలా భూ సమస్యలవి ఉంటున్నాయి. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల ప్రకారం భూ సమస్యల పరిష్కారంలో ముందుకు సాగుతున్నాం. ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం లేదు. రెండు వర్గాలను పిలిపించి మాట్లాడాక క్షేత్రస్థాయి విచారణ జరుపుతున్నాం. క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పరిష్కారం కాకుంటే అది శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉంటుంది. వీటితో పాటు కుటుంబాల మధ్య ఉన్న భూ సమస్యల ఫిర్యాదులు అందుతున్నాయి.

మత్తు పదార్థాలు ప్రమాదకరం

యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. ఇది చాలా ప్రమాదకరం. దీనిని ప్రాథమిక స్థాయిలోనే కట్టడి చేయాలి. దీనికోసం ఊరూరా అవగాహన కల్పిస్తున్నాం. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే పాఠశాల స్థాయి నుంచే అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. దీంతోపాటుముఖ్యంగా తల్లిదండ్రులు వారి పిల్లలు ఏం చేస్తున్నారో తెలుసుకోవాలి. రాత్రివేళ బయటికి వెళ్తే ఎందుకు, ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకోవాలి. అనుమానం వస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇలా ప్రతి ఒక్క తల్లిదండ్రి బాధ్యతగా ప్రవర్తిస్తే పిల్లలు దారి తప్పే అవకాశం లేదు.

చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరం..

చాలామందికి అన్ని సమస్యలకు పోలీస్‌స్టేషన్‌లోనే పరిష్కారం దొరుకుతుందనుకుంటారు. ఇది సరైంది కాదు. ఏ సమస్య.. ఏ ప్రభుత్వ శాఖకు సంబంధించినదో ముందుగా తెలుసుకోవాలి. అక్కడికి వెళ్తే పరిష్కారం అవుతాయి. అన్యాయాన్ని ప్రశ్నించే తత్వం పెరగాలి. చట్టంలో ఉన్న పరిష్కార మార్గాలు తెలియాలి. వాటిని వినియోగించుకోవాలి.

భూ సమస్యలను నిశితంగా పరిశీలించాలి

భూ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను స్థానిక పోలీస్ అధికారులు నిశితంగా పరిశీలించాలి. తొందరపాటు అవసరం లేదు. బాధితులు కూడా ఒక స్థాయిలో పరిష్కారం కాకుండా పై స్థాయిలో దొరుకుతుంది. అంతే తప్ప క్షణికావేశానికి గురై దాడులు, ప్రతి దాడులు చేసుకోవద్దు. అలాంటివి చేస్తే శాంతిభద్రతల సమస్య ఏర్పడుతుంది. అప్పుడు కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రతి ఫిర్యాదుపై కూడా ఉన్నతాధికారుల పర్యవేక్షణ నిరంతరం సాగుతూనే ఉంటుంది.

నగరంలో పది చోట్ల ఏఈడీలు

- అకస్మాత్తు గుండెపోటునుంచి రక్షించేందుకు తోడ్పాటు
- జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు
- బల్దియా కమిషనర్ ప్రావీణ్య



వరంగల్ అర్బన్: అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలిపోయే వారి ప్రాణాలను కాపాడేందుకు నగరంలోని పది జనం రద్దీగా ఉండే చోట్ల ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబిలేటర్స్ (ఏఈడీ) పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్లు గ్రేటర్ వరంగల్ కమిషనర్ ప్రావీణ్య తెలిపారు. సోమవారం సాయంత్రం హనుమకొండ 'కుడా' కార్యాలయంలో జరిగిన సమావేశంలో రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే ఈ పరికరాల ద్వారా ఆకస్మికంగా గుండె ఆగిపోయిన వారికి ఏ విధంగా రక్షించే తీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రావీణ్య మాట్లాడుతూ రాష్ట్ర పురపాలక శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బల్దియా అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది, ఉద్యోగులకు, ఇతర వర్గాలకు సీపీఆర్‌పై మెళకువలు నేర్పేందుకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. బల్దియా సూపర్‌వైజర్ల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు.

ఏఈడీ పని విధానం ఇలా..

- ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబిలేటర్స్ వ్యవస్థ డిఫిబిలేటర్, బ్యాటరీ, ప్యాడ్ ఎలక్ట్రోడ్‌లు, అడాప్టర్ వంటి దాని అవసరమైన ఉపకరణాలు ఉంటాయి.
- ఏఈడీని ఆన్ చేయగానే అందులో ఏమి చేయాలనేది వాయిస్ రూపంలో వస్తుంది. కార్డియాక్ అరెస్ట్‌లో ఉన్న వ్యక్తి చాతీపై సెన్సార్‌లతో రెండు స్టిక్కీ ప్యాడ్‌లను జతచేయాలి.
- స్టిక్కీ ప్యాడ్‌ల ద్వారా ఎలక్ట్రోడ్లు ఏఈడీలోని ప్రాసెసర్‌కు వ్యక్తి గుండె లయ సమాచారాన్ని పంపుతాయి. అప్పుడు ఆ వ్యక్తికి విద్యుత్ షాక్ అవసరమా కాదా అనేది విశ్లేషిస్తుంది.
- డీఫిబ్రిలేషన్ షాక్ అవసరమైతే, షాక్‌ను అందించడానికి బటన్‌ను ఎప్పుడు నొక్కాలో చెబుతుంది. కొన్ని ఏఈడీలలో దానంతట అదే అవసరమైనప్పుడు షాక్‌ను అందిస్తుంది.
- దీని వల్ల గుండెనాళాల్లోని అడ్డంకులు తొలగి రక్త ప్రసరణ జరిగి ఆ మనిషి బతికే అవకాశం ఉంటుంది.

రూ.98.50కోట్లతో ఐసీసీసీ

600 కెమెరాలు, 10 జంక్షన్ల అభివృద్ధి

- ఆధునిక అనుసంధానంతో బహుళార్థక ప్రయోజనాలు
- డీపీఆర్‌పై నిపుణుల సలహాలు



స్టేక్ హోల్డర్ల సమావేశంలో మాట్లాడుతున్న స్మార్ట్‌సిటీ ఎండీ ప్రావీణ్య

వరంగల్ అర్బన్: నగరానికి నాడీ వ్యవస్థగా వ్యవహరించే ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ఏర్పాటుపై నిపుణులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. అత్యవసర కాల్ బాక్సులు, విపత్తుల సమయంలో పౌరులను అప్రమత్తం చేసే వ్యవస్థ, కూడళ్లలో సీసీ టీవీలు ప్రధాన కంట్రోల్ సెంటర్‌కు అధునాతన పద్ధతుల్లో అనుసంధానంతో బహుళ ప్రయోజనాలు సమకూరనున్నట్లు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం హనుమకొండలోని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) కార్యాలయంలో స్మార్ట్ సిటీలో భాగంగా ఆవిష్కరించనున్న సెలక్షన్ ఆఫ్ మాస్టర్ ఇంటిగ్రేటర్ ఫర్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌పై రూపొందించిన డీపీఆర్‌పై స్టేక్ హోల్డర్లతో సమావేశం జరిగింది. గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రావీణ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏరియా ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్, సీసీటీవీ సర్వైలెన్సు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పెలికాన్ సిగ్నల్ సిస్టమ్, వేరియబుల్ మెస్సేజింగ్, పబ్లిక్ అనౌన్స్‌మెంట్, ఇ-గవర్నెన్సు, ఎన్విరాన్మెంటల్ సెన్సార్, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) తదితర అంశాలపై నిపుణులు చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎండీ ప్రావీణ్య మాట్లాడుతూ మహా నగరంలో స్మార్ట్ సిటీ నిధులతో రూ.98.50 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఐసీసీసీలో మొత్తం సిటీ సర్వేలెన్స్ నిమిత్తం సుమారు 600 కెమెరాల ఏర్పాటు, 10 జంక్షన్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. నగరానికి వచ్చే వాహనాల నంబర్లతో సహా గుర్తింపు ఏఎన్‌పీ ఆర్ కెమెరాలు, తదితర కాంపోనెంట్‌లతో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నిపుణులు, ప్రభుత్వ శాఖల అధికారుల సలహాలు, సూచనలను క్రోడీకరించి ఐసీసీసీలో మ్యాపింగ్ చేసేందుకు పంపించాలని నిర్ణయించారు. సమావేశంలో వరంగల్ అదనపు కలెక్టర్ శ్రీవత్స, డీసీపీలు పుష్ప, అబ్దుల్ బారి, స్మార్ట్ సిటీ పీఎంఈ ఆనంద్ వోలెటి, ఎస్‌ఈలు ప్రవీణ్ చంద్ర, కృష్ణారావు, సిటీ ప్లానర్ వెంకన్న, సీపీఓ అజిత్ రెడ్డి, నిట్ ప్రొఫెసర్ సీఎస్ ఆర్కే ప్రసాద్, ఆయా శాఖల ఈఈలు, నిపుణులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ భూముల పరిశీలన




సాక్షి ఎఫెక్ట్

పరిశీలిస్తున్న డీఈఈ రాజు

హసన్‌పర్తి: గ్రేటర్ శివారులోని ఎస్సారెస్పీ భూములను నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. ఆయా భూముల ఆక్రమణ తీరుపై సాక్షిలో సోమవారం 'ఆగని ఆక్రమణ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై నీటిపారులశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు డిప్యూటీ డీఈ రాజు క్షేత్రస్థాయి పరిశీలించారు. కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేస్తామని తెలిపారు.

కళాధ్వనిగా స్ప్రింగ్‌స్ప్రీ-23

థీంను ఆవిష్కరిస్తున్న నిట్ డైరెక్టర్ రమణారావు, విద్యార్థులు







కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ప్రతి ఏడాది నిర్వహించే వసంతోత్సవం స్ప్రింగ్‌స్ప్రీ-23ని ఈసారి కళాధ్వనిగా నామకరణం చేశారు. కాలేజీలోని టైమ్‌స్కేర్‌ప్లాజాలో సోమవారం డైరెక్టర్ ఎన్వీ.రమణారావు ముఖ్య అతిథిగా హాజరై ఆ థీంని ఆవిష్కరించి మాట్లాడారు. ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమం 'సంస్కృతి ప్రతిధ్వనిస్తుంది' అనే ట్యాగ్‌లైన్‌తో సంస్కృతీసంప్రదాయాల వేదికగా నిలవాలని అన్నారు. డ్యాన్స్, మ్యూజిక్, థియేటర్ ఆర్ట్, స్పోర్ట్స్‌లతో పాటు వివిధ రకాల సంస్కృతీసంప్రదాయాల ప్రదర్శనలు, ఈవెంట్లతో అలరించనుందని డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వయిజర్ హీరాలాల్ తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలలనుంచి పదివేల మంది విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్

స్ప్రింగ్‌స్ప్రీ-23 థీం ఆవిష్కరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లాష్‌మాబ్‌లో విద్యార్థులు 'డీజే కొట్టు నా బోటే ఎక్కు, బాసు వేర్ ఇజ్‌ద పార్టీ, ఏ బిడ్డా ఇది నా అడ్డా, ఓ సీతా వదలను నీనికా, అయారే ఆయా స్ప్రింగ్‌స్ప్రీ అంటూ' ఉత్సాహంగా చిందులు వేశారు.

అన్ని హంగులతో వేడుకలు

హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం

- వివరాలు 10లో

క్లుప్తంగా

సెల్‌ఫోన్ దొంగ పట్టివేత



ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో పిల్లల వార్డులో సోమవారం సెల్‌ఫోన్ దొంగలిస్తున్న ఓ వ్యక్తిని సెక్యూరిటీ గార్డులు పట్టుకుని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే..ఆస్పత్రిలోని పిల్లల వార్డులో సోమవారం తెల్లవారు జామున ఓ వ్యక్తి సెల్‌ఫోన్ దొంగలిస్తున్నాడు. గమనించిన సెక్యూరిటీ సూపర్‌వైజర్ శ్రీనివాస, రమేశ్‌లు అతన్ని పట్టుకుని ఔట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు.

కేయూలో మెస్ బంద్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో అడ్మిషన్ల డైరెక్టరేట్‌లో పీజీ కోర్సుల విద్యార్థులకు మెస్ సౌకర్యం కల్పిస్తున్న విషయం విధితమే. కామన్‌మెస్‌లో మరమ్మతులు పూర్తికాగా అడ్మిషన్ల డైరెక్టరేట్ నుంచి సామాన్లు, ఫర్నీచర్‌ను కామన్‌మెస్‌లోకి తీసుకొస్తున్నామని అందుకు సోమవారం నుంచే మెస్ సదుపాయాన్ని యూనివర్సిటీ అధికారులు బంద్ చేశారు. అల్పాహారం కూడా పెట్టలేదు. రేపటి వరకు భోజనం కూడా బంద్ చేస్తారని, రాత్రి డిన్నర్ నుంచి రీఓపెన్ చేయనున్నట్లు సమాచారం. కేవలం అడ్మిషన్ల డైరెక్టరేట్ నుంచి కామన్‌మెస్‌కు సామాను షిఫ్టింగ్‌కు మూడు రోజుల పాటు మెస్ సౌకర్యం బంద్ చేయటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కామన్‌మెస్‌ను రీ ఓపెన్ చేయాలని విద్యార్థులు ఇటీవల ఆందోళన చేసిన విషయం విధితమే. కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు కూడా ఇటీవల సందర్శించి త్వరలోనే రీ ఓపెన్ చేస్తామని ప్రకటించారు. సామాను షిఫ్టింగ్ పేరుతో మెస్ బంద్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

రంగుల పండుగ వచ్చేసింది..



మోదుగు పూల చెట్టు



రంగుల అమ్మకాలు

- సహజ సిద్ధమైన రంగులే మేలు
- స్నానానికి చెరువులు, వాగులు, కుంటలకు సరదాకు వెళ్లి.. ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

నేడు హోలీ

జనగామ: తెలుగు నెలల్లో చివరికి వచ్చే పాల్గుణ మాసం పౌర్ణమి రోజున హోలీ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చతుర్దశి నాడు కాముని దహనం నిర్వహించి మరుసటి రోజు రంగుల హోలీ జరుపుకుంటారు. దీపావళి తర్వాత దేశంలో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగల్లో హోలీ ఒక్కటి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం హోలీ వేడుకలు జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. రంగులు చల్లుకోవడంతో పాటు గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సహజరంగులే మేలు

హోలీ వేడుకల్లో ప్రాణాంతక రసాయనాలు వాడకూడదు. వీటితో చర్మ సంబంధ వ్యాధులతో పాటు కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే సహజసిద్ధమైన గోరింటాకు పొడి, కుంకుమ, పసుపు, టమాటా గింజలు, మోదుకు పూల పొడితో తయారు చేసిన రంగులతో వేడుకలు జరుపుకోవాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే..

హోలీ సంబురాలు కుటుంబాల్లో విషాదం నింపకుండా చూసుకోవాలి. ఏటా జిల్లాలో ఏదో ఒక చోట చెరువులు, వాగులు, కుంటల వద్దకు స్నానానికి వెళ్లి నీటిలో మునిగిపోతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. చెరువులు, జలాశయాల వద్ద సెల్ఫీలు దిగడం.. సరదాలకు పోయి.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కాస్త జాగ్రత్తలు పాటిస్తే.. పండుగలను సంతోషంగా మార్చుకోవచ్చు. ఈతకు వెళ్లేవారు చెరువులోతు ఎంత ఉంది.. ఎక్కడ గోతులున్నాయో తెలుసుకోవాలి. ఏమీ తెలియకుండా అందులో దూకితే బండలు, ముళ్ల కంపలతో ప్రాణాపాయం ఉంటుంది. మద్యం సేవించి నీటిలో ఎట్టి పరిస్థితుల్లో దిగకూడదు. ఈత రాకుంటే అటు వైపే వెళ్లొద్దు.

సూచనలు

హోలీ ఆడటానికి ముందు ముఖానికి మాయిశ్చరైజర్, తలకు నూనె రాసుకోవడం ఉత్తమం. దీని వల్ల రంగులు శరీరానికి సరిగా పట్టుకోవు ఇంకవు. దీంతో రంగులను శుభ్రం చేసుకోవడం చాలా సులభమవుతుంది. చాలా మంది రంగుల్లో వివిధ ఆయిల్స్ కలిపి రాస్తుంటారు. ఈ కారణంగా రంగులను శుభ్రం చేయడానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది.

కెమికల్స్ రంగులు వద్దు



రంగుల పండుగ మోజులో కెమికల్స్ కలిపిన కలర్లను వాడితే ప్రమాదం తెచ్చుకున్నట్టే. మనపై చల్లే రంగుల నుంచి వచ్చే పొగ కడుపులోకి పీల్చుకోవడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలతో పాటు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడతారు. రంగులు ఎక్కువగా కంటిలో పడితే శాశ్వత అంధకారం సైతం రావచ్చు. అలాగే స్కిన్ ఎలర్జీకి సైతం గురవుతారు. ప్రకృతి సహజసిద్ధమైన రంగులతో పండగ జరుపుకుని, ఆరోగ్య వంతమైన జీవితం గడపాలి.

\- వనం శ్రీనివాస్, ఎండీ సివిల్ సర్జన్

నీటితో ఆటలొద్దు



రంగుల పండుగ పూర్తయిన తర్వాత చాలామంది యువకులు, పెద్దలు స్నానం కోసం చెరువులు, బావులు, జలాశయాల వద్దకు వెళ్తుంటారు. స్నేహితులతో కలిసి రంగుల పండుగ జరుపుకున్న తర్వాత, ఇంటి వద్దనే ఫ్రెష్ కావాలి. జలకాలాట కోసం చెరువులు, బావుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. చెరువులు, కుంటల్లో ఉపాధిహామీ పనుల్లో భాగంగా పూడిక తీత పనులు చేపట్టడం వల్ల పెద్ద పెద్ద గుంతలు ఉండే అవకాశం ఉంది. ఎట్టి పరిస్థితుల్లో సాహసం చేయరాదు. పోలీసులు సైతం ప్రతీచోట నిఘా వేసి ఉంచారు.

\- ఎలబోయిన శ్రీనివాస్, సీఐ,జనగామ

గంజాయి విక్రయదారుల అరెస్ట్

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



అరెస్టు చేసిన నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

రామన్నపేట: వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి తెలిపారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయ్ విక్రయాలపై అందించిన మేరకు ఇంతేజార్ గంజ్ పోలీసులతో సోమవారం సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. వరంగల్ బస్టాండ్ సమీపంలో పావురాల రమేశ్, బందెల సాయికుమార్, మహ్మద్‌చాంద్ పాషా, మహ్మద్ సమీర్‌లు గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. ఈ సమాచారం మేరకు దాడులు నిర్వహించిన క్రమంలో విక్రయదారుల నుంచి 500 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అనంతరం వారిని విచారించగా తాము కామన్ ఫ్రెండ్స్ అని రెండు సంవత్సరాల నుంచి గంజాయి తాగడం, అమ్మడం అలవాటుగా ఉందని పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ గంజాయిని సుమంత్, సాయి, విక్కీల నుంచి పలుమార్లు కొనుగోలు చేసినట్లు తెలిపారని వివరించారు. ప్రస్తుతం ఆ ముగ్గురి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. అరెస్టు అయిన వారిలోని పావురాల రమేశ్‌పై వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబాబాద్‌లతో పాటు సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లలో 23 కేసులు ఉన్నట్లు తెలిపారు.

బాలికపై ముగ్గురు యువకుల లైంగికదాడి

- మూడు రోజులుగా అత్యాచారం
- బాధితురాలిది మధ్యప్రదేశ్
- సుబేదారి పీఎస్‌లో ఫిర్యాదు.. కేసు నమోదు
- నిందితులపై అత్యాచారం, పోక్సోకింద కేసు నమోదు

వరంగల్ క్రైం: మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ బాలికపై అదే రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులు గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. ఈ ఘటన వరంగల్ నగరంలో ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. సుబేదారి ఇన్‌స్పెక్టర్ షూకుర్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన బాలిక తల్లిదండ్రులు కొద్ది రోజుల క్రితం అక్కడ మరణించారు. దీంతో బాలికను తన బాబాయ్ వేధింపులకు గురి చేయడంతో భరించలేక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా సికింద్రాబాద్‌కు చేరుకుంది. వరంగల్‌లో టైలర్ పనిచేసే మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు వారం రోజుల క్రితం సికింద్రాబాద్‌కు వెళ్లిన క్రమంలో అక్కడ ఆ బాలికతో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి వివాహం చేసుకుందామని హనుమకొండలోని హౌసింగ్ బోర్డులో ఓ ఇంటి కిరాయిని తీసుకుని సహజీవనం ప్రారంభించారు. మూడు రోజులనుంచి యువకుడితో ఉండే మరో ఇద్దరు యువకులు ఒకరి తరువాత ఒకరు బలవంతంగా అత్యాచారం చేయడంతో బాధితురాలు ఆదివారం సాయంత్రం హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మధ్యప్రదేశ్‌కు చెందిన సర్ఫరాజ్, సిరాజ్, ఇస్మాయిల్ అనే యువకులపై అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ షూకుర్ తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

హసన్‌పర్తి/గీసుకొండ: కడుపునొప్పి భరించలేక ఒకరు, తాగుడుకు బానిసగా మారి జీవితంపై విరక్తి చెంది ఓ ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఇద్దరు మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన శీలం రామరాజు (42) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా రామరాజు కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఆస్పతి సిబ్బంది సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన ఆడెపు రాజు(32) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంటి వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

యువకుడి మృతి

ఖిలా వరంగల్: ఆర్థిక కారణాలతో గత నెల 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రంగశాయిపేటకు చెందిన ఎండీ గౌస్ పాషాకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. పెద్ద కుమారుడు ఎండీ సల్మాన్ (25) ఫర్నీచర్ షాపులో పని చేస్తుంటాడు. అయితే స్మార్ట్ ఫోన్ కావాలని తండ్రి గౌస్‌పాషాను అడిగితే ఇప్పించలేదు. దీంతో మనస్తాపానికి గురై గత నెల 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి గౌస్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సైతో విదేశీయుడి గొడవ

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అదాలత్ జంక్షన్‌లో సోమవారం సాయంత్రం విధుల్లో ఉన్న కాజీపేట ట్రాఫిక్ ఎస్సై రాజేష్, సిబ్బందితో లైబేరియా దేశస్తుడు స్టీవ్ బ్యాన్‌జీవ్ గొడవపడినట్లు ఇన్‌స్పెక్టర్ షూకుర్ తెలిపారు. ఎస్సై రాజేష్ ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వాహన చోదకుడిపై దాడి

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌కు చెందిన బిల్లా జయశంకర్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు ఆపి దాడి చేశారు. సోమవారం రాత్రి గరీబ్‌నగర్ బస్టాప్ వద్ద బైక్ ఓవర్ స్పీడ్‌తో ప్రయాణిస్తున్న జయశంకర్‌ను అశోక్, బాణాల హరీష్‌లు పట్టుకున్నారు. ఇంతవేగం ఎందుకు వెళ్తున్నావని దాడిచేసినట్లు తెలిసింది. బాధితుడు బిల్లా జయశంకర్ ఫిర్యాదు మేరకు అశోక్, బాణాల హరీష్‌లపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

బులియన్ మర్చంట్ సహాయ కార్యదర్శి మృతి

వరంగల్ చౌరస్తా: ది వరంగల్ బులియన్, జువెల్లర్స్, డైమాండ్ మర్చంట్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి జడల సుకుమార్ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. వరంగల్ ఆర్ఎస్‌టీ రోడ్డులో గల సుకుమార్ భృతదేహాన్ని అసోసియేషన్ ప్రతినిధులు, వ్యాపారులు, రాజకీయ పార్టీల నేతలు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సంతాపంగా వరంగల్ చౌరస్తా, జేపీఎన్ రోడ్డులోని పలు బంగారు, వెండి ఆభరణాల షాపులను బంద్ చేశారు. మృతదేహాన్ని సందర్శించిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు గుండు శ్రీనివాస్, ప్రతినిధులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

కేటీఆర్ సభకు భారీసంఖ్యలో తరలించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్: ఈ నెల 8న మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని తొర్రూరు మండల కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సభకు పాలకుర్తినుంచి భారీ సంఖ్యలో మహిళలను తరలించాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పాలకుర్తినుంచి 4వేల మంది మహిళలను తరలించాలని సూచించారు. తొర్రూరు సభలో మంత్రి కేటీఆర్ చేతులమీదుగా రుణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ రాంరెడ్డి, ఆదనపు పీడీ నూరోద్దిన్, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, పాలకుర్తి సర్పంచ్ వీరమానేని యాకాంతరావు, ముస్కు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హెలిపాడ్, సభాస్థలి పరిశీలన

వరంగల్(పర్వతగిరి): నేటి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఏనుగల్‌లో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ రానుండగా సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, కలెక్టర్ గోపి హెలిపాడ్ సభా స్థలం, పార్కింగ్ స్థలాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు.

దేశాయిపల్లివాసికి తమిళనాడులో ప్రమాదం..

- ల్యాబ్‌లో యాసిడ్ బాటిల్ పేలి తీవ్రగాయాలు
- ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స



తమిళనాడులో చికిత్స పొందుతున్న రజినీకుమార్

దుగ్గొండి: తమిళనాడు రాష్ట్రంలో ప్రమాదవశాత్తు ల్యాబ్‌లో యాసిడ్ బాటిల్ పేలి వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం దేశాయిపల్లికి చెందిన కందికొండ రజినీకుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ప్రభుత్వ ఆస్పత్రిలో చావు బతుకుల మధ్యన కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే..రజినీకుమార్ గత కొన్ని సంవత్సరాలుగా తమిళనాడు రాష్ట్రంలోని ట్యుటికోరిన్ జిల్లా కేంద్రంలో ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇదే క్రమంలో ఆదివారం విధులు నిర్వర్తిస్తుండగా యాసిడ్‌తో నిండి ఉన్న గాజు బాటిల్ పేలిపోయింది. దీంతో గాజు ముక్కలు రజినీకుమార్ పొట్టకు గుచ్చుకున్నాయి. యాసిడ్ పొట్ట, కాళ్లు, చేతులపై పడటంతో తీవ్రంగా కాలిపోయాయి. వెంటనే అతన్ని సిబ్బంది ట్యుటికోరన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు రోగి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలపడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు..

అండగా ఉంటానని ఎమ్మెల్యే పెద్ది హామీ

రజినీకుమార్ ఆరోగ్య పరిస్థితిని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వెంటనే రజినీకుమార్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ట్యుటికోరన్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. తమిళనాడు వైద్యుల అనుమతితో రోగిని తన సొంత ఖర్చులతో విమానంలో హైదరాబాద్‌కు తీసుకువచ్చి ప్రభుత్వ నుంచి ఎల్‌ఓసీ ద్వారా యశోద ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తామన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు రజినీకుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

హోలీ ఆడుకునేందుకు వెళ్లి వచ్చి..

- నీటి సంపులో పడి బాలుడు మృతి



కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి



కుశాంత్‌కుమార్ (ఫైల్)

గార్ల: హోలీ ఆడుకునేందుకు వెళ్లివచ్చి ఇంటి ఆవరణలోని నీటి సంపు వద్దకు కాళ్లచేతులు కడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన గార్ల మండల పరిధిలోని చవిటి తండాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చవిటితండాకు చెందిన గుగులోత్ కుశాంత్‌కుమార్(4) తోటి స్నేహితులతో కలిసి హోలీ ఆడుకుని ఇంటికి వచ్చాడు. ఇంటి ఆవరణలోని నీటి సంపువద్దకు కాళ్లు చేతులు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిసంపులో పడిపోయాడు. బాలుడి తండ్రి వీరన్నకు కిరాణం షాపు ఉండడంతో బిజీగా ఉన్నాడు. రాత్రి పడుకునేముందు కుమారుడు ఇంకా రాలేదని స్నేహితుల వద్దకు వెళ్లి ఆరా తీయగా రాత్రి 8గంటలకే ఇంటికి వచ్చాడని తెలిపారు. అనంతరం తండా అంతా తిరిగి ఇంటికి వచ్చిన తండ్రి నీటి సంపులో చూడగా మునిగిపోయి ఉన్నాడు. కొన ఊపిరితో ఉన్న కుమారుడిని వెంటనే చికిత్స నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలుడు మృత్యువాత పడ్డాడు. సోమవారం ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించగా స్వగ్రామానికి తీసుకొచ్చారు. బాలుడిపై పడి తల్లిదండ్రులు రోదించిన తీరు పలువురిని కలిచివేసింది. బాలుడి తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు.

బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఉదయ్ ప్రతాప్

వరంగల్ చౌరస్తా: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని వరంగల్ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఉదయ్ ప్రతాప్ ఆదేశించారు. సోమవారం వరంగల్ చౌరస్తాలో ఓ కన్వెన్షన్ హాల్‌లో పొట్టి శ్రీనివాస్ అధ్యక్షతన తూర్పు నియోజక వర్గ బూత్ స్వశక్తికరణ్ అభియాస్ వర్క్‌షాపు జరిగింది. ఈ సమావేశానికి ఉదయ్ ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నియోజక వర్గ కోఆర్డినేటర్ కల్లెం బారెడ్డి, నాయకులు కుసుమ సతీష్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, అచ్చ విద్యాసాగర్, రత్నం సతీష్ షా, కొల్లూరి యోగానంద్, బాకం హరిశంకర్, ఎరుకాల రఘునారెడ్డి, కనుకుంట్ల రంజిత్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ల సిబ్బందికి సెలవులు లేవు

వరంగల్ అర్బన్: ఆస్తి, నీటి పన్నుల చెల్లింపునకు మీ సేవ కేంద్రాలు తెరచి ఉంటాయని బల్దియా డిప్యూటీ కమిషనర్ జోనా తెలిపారు. సోమవారం హన్మకొండ చౌరస్తాలో ఓ వాణిజ్య సంస్థ ఆస్తి పన్ను రూ.1.23 లక్షల చెక్కును డిప్యూటీ కమిషనర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బల్దియా ఆర్‌ఓలు, ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లకు సెలవులను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ శ్రీనివాస్, ఆర్‌ఐలు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

280 మద్యం బాటిళ్లు పట్టివేత

- నిందితుడి అరెస్ట్



బాటిళ్లను స్వాధీనం చేసుకుని శ్రీకాంత్‌ను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

ఖిలా వరంగల్: రైలు మార్గం ద్వారా వరంగల్ మహానగరానికి ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఎక్సైజ్ సుంకం చెల్లించకుండా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి 90ఎంఎల్ సైజ్ గల 280 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు మండల ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం రాత్రి ఖిలా వరంగల్ మండలం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు ఆదేశాల మేరకు రైల్వే మార్గం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి వరంగల్ నగరానికి పెద్ద ఎత్తున మద్యం, ఎండు గంజాయి దిగుమతి అవుతుందని పక్కా సమాచారం అందిందని తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఎక్సైజ్‌శాఖ అధికారులు నిఘా వేసి ఉంచారు. ఓ వ్యక్తి రైలు దిగి శివనగర్ వైపు వెళ్లే ప్రాంగణానికి చేరుకున్నాడు. ప్రయాణికుల బ్యాగులు ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేస్తున్నారు. అందులో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నక్కలగుట్ట తండాకు చెందిన ధారవత్ శ్రీకాంత్ బ్యాగును పరిశీలించగా బ్యాంగులో సుంకం చెల్లించని ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన 280 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వెంటనే అతన్ని అరెస్ట్ చేసి రూ. 23వేల విలువైన బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై బి.సరతి, హెడ్‌కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుళ్లు ఎ.చిరంజీవి, బి.కరుణాకర్, అహ్మద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.